# దేవుడనేవాడున్నాడు

**పెళ్ళిచూపుల్లో "మా అబ్బాయి మెతక, నువ్వే కాస్త జాగ్రత్తగా చూసుకోవాలి" అని అత్తయ్య గారంటే మురిసిపోయాను.**

**అమ్మ కూడా చిన్నగా చెవిలో 'మీ అత్తా.. మావగార్లు పదిమాటలకో మాట మాట్లాడుతున్నారు. కట్న కానుకల కోసం హింసించే రకం కాదు. సౌమ్య హృదయులు. ఆడబడుచులు లేరు. అబ్బాయి ఒక్కడే! ఇహ అతడి నోరు కూడా మెత్తనైతే.. నువ్వు సుఖపడినట్టేనే' అంది. పెళ్ళిచూపుల్లో, అందునా మొట్టమొదటి పెళ్ళిచూపుల్లోని ఈ సన్నివేశం ఏ కన్నెపిల్లకైనా ఆనందాన్నిచ్చేదే కదా! అందుకే నా మనసూ పురివిప్పి నాట్యం చేసింది.**

పెళ్ళయిన కొత్తల్లోనే తెలిసింది, బొత్తిగా ఆయన నోట్లో నాలుక లేదని. లౌక్యం తెలీదనీను. అందరూ అలాంటి మొగుడు దొరికినందుకు నా అదృష్టాన్ని ప్రత్యక్షంగా తెగపొగిడారు. పరోక్షంలో 'నోరూ వాయీలేని వాజమ్మ, తనకు తనే పెళ్ళాం కొంగుకు బందీ అయిపోయాడు' అని ఎకసెక్కాలాడారు. ప్రతి మనిషి తన మాటలతోనో, చేతలతోనో, ఇష్టాయిష్ట అభిరుచులతోనో ఉనికి నేర్పరచుకుంటాడు. కానీ ఈయన గురించి చాలా తక్కువమందికి మాత్రమే తెలుసు. నలుగురితో కలవడు, కలిసినా వాళ్ళవేవన్నా సమస్యలుంటే నెత్తిమీద వేసుకుని తీర్చి, వాళ్ళ అవసరం తీరిందనుకున్నాక ఇహ అక్కడ వుండమన్నా వుండడు. కాబట్టి పక్క వాళ్ళకు కూడా ఈయన గురించి అట్టే తెలియదు. 'నాకిది ఇష్టం' అని ఏనాడూ నాకు చెప్పలేదు. ఉన్నదాంతో సంతృప్తి పడతాడు. లేనిదాని కోసం పాకులాడడు. అసహనం వ్యక్తం చేయడు.

ఆఫీసులో అందరూ ఈయన దగ్గర అప్పులు తీసుకుంటారు. కానీ ఈయనెప్పుడూ తీర్చమని అడగడు. నేను గట్టిగా 'నిన్నటిదాకా అంటే సరే! ఇప్పుడు మీకు పెళ్ళై భార్య కాపురానికొచ్చింది. బాధ్యతలు పెరిగాయి. ఇప్పుడు ఎలా కుదురుతుంది?' అంటే నవ్వి "నాకు అభిమానించే అమ్మానాన్నలు, ప్రేమని పంచే నువ్వూ దొరికారు; మనకు సమస్యలనేవి రావు, వచ్చినా దూదిపింజలైపోతాయి, అందరికీ అలా కుదరొద్దూ, మన పక్కనున్న వాళ్ళని మనమే అర్థం చేసుకోవాలి, ఇచ్చే వీలుంటే ఇవ్వరూ, అడిగి మనమెందుకు బాధపెట్టాలి?" అంటాడు. ఆయనకు నేనంటే వల్లమాలిన ప్రేమ. అది నన్ను ఇంతకంటే గొంతు పెంచనీయదు. కటువుగా మాట్లాడనీయదు. కానీ ఈ మనిషితో ఎలా కాపురం చేయడం? అవసరం తీరాక ఎవరన్నా గుర్తుంచుకుని తీసుకున్న అప్పు తిరిగి ఇస్తారా? బొత్తిగా పిచ్చిమాలోకం.

మా ఆయన విషయం అలా అలా మా బంధువర్గమంతా పాకి మేమిక్కడ హైద్రాబాదు సిటీలో వుంటున్నాం కాబట్టి 'అవసరానాం హైద్రాబాదు గతిః' అన్నట్టు.. ఏ అవసరం వచ్చినా మా ఇంటి తలుపు తట్టేవారు. మొదట్లో అలా దూరదూరపు బంధువర్గం తమ అవసరాల కోసం మా ఇంటి తలుపు తట్టడం గొప్పగా, గర్వంగా అనిపించేది. కానీ రాన్రాను వచ్చిన వాళ్ళకు వసతులు ఏర్పాటు చేయడం, అన్న సంతర్పణలు చేయడం, నాకు భారం అనిపించ సాగింది. వీరిలో మా వాళ్ళు కూడా ఉండేవారు. మావాళ్ళు అలా ఇంటిమీద గద్దల్లా వాలడం సిగ్గుగా కూడా అనిపించేది. కానీ ఆయనకవేం పట్టేవి కావు. ఎల్లప్పుడూ తరతమ బేధాలెరుగని సౌశీల్య భావన ఆయన ముఖంలో ద్యోతకమవుతుండేది.



**దేవుడనేవాడు అన్నిచోట్లా తానుండలేక తనకు మారుగా ఇలాంటి కొంతమందిని సృష్టిస్తాడనిపించింది. ఎవరికైనా ఏదైనా సమస్య వస్తే 'తాను ఓటేసి గెలిపించాడు కదా' అని ప్రభుత్వం తలుపు తట్టలేడు. ఇహ, పర లోకాల గురించి సమగ్రంగా వివరించి మనసుని మైమరపించే బాబాలు, స్వాముల గడప తొక్కలేడు. వాళ్ళని ఆదుకునేది పక్కింట్లోని ఈయనలాంటి సామాన్యుడే! అవసరానికి మాట సహాయం, డబ్బు సహాయం చేసి ధైర్యాన్నిచ్చేది అతడే! ఎవరికి వారు స్వార్థంతో తమచుట్టూ ఒక పరిధి గీసుకుని అందులోనే బందీ అయిపోతే సమాజం అనే పదానికి అర్థమేమిటి? సంఘజీవి అన్నదానికి అస్తిత్వమేది?**

నేనోరోజు భోజనాల దగ్గర 'పనుల మీద లేనిపోని చుట్టరికాలతో మనింటికి జనం రావడం ఎక్కువయింది. మీ చిరునవ్వుతో కూడిన పలకరింపే వాళ్ళనలా మళ్ళీ మళ్ళీ మనింటికి రప్పిస్తోంది. ఇదేమీ సత్రం కాదు కదా? ఎవరన్నా మనింటికొస్తే మీరు ముఖం కందగడ్డలా పెట్టుకుని, పెడసరంగా నాలుగు మాటలు మాట్లాడితే రాబందుల తాకిడి తక్కువవుతుంది' అన్నాను కోపంగా.


దానికాయన నిలువెల్లా ఆశ్చర్యపోతూ "అదేంటి నీలూ అలా అంటావు? మనిషికి మనిషని ఊరకే అన్నారా? సిటీలో ఏ పనిమీదైనా దిగితే డబ్బు మంచినీళ్ళలా ఖర్చవుతుంది. అదే మనకు తోచినంతలో మనం ఆదుకుంటే తమవాళ్ళు, ఆదుకునేవాళ్ళు ఇక్కడున్నారన్న ఆనందం వాళ్ళ ప్రాణానికి కాస్త హాయిని చేకూరుస్తుంది. పైలోకంలో మన అకౌంట్లో కాస్త పుణ్యమూ క్రెడిటవుతుంది' అంటాడు తేలికగా తీసిపారేస్తూ. ఇంకేం మాట్లాడతాను?

నాకు ఇద్దరు చెల్లెళ్ళున్నారు. కాలక్రమేణా వాళ్ళ పెళ్ళిళ్ళూ అయిపోయాయి. నా ఇద్దరు మరుదులూ దేశముదుర్లు. ఎవర్ని ఎక్కడుంచాలో తెలిసిన వాళ్ళు. ముఖ్యంగా 'బంధుత్వాలెక్కువయితే, ఆర్థికంగా సన్నబడతాం' అన్న సూత్రం బాగా ఒంట బట్టించుకున్నారు. అందుకే తక్కువ సమయంలోనే ఇద్దరూ మాంచి ఇళ్ళు కట్టించుకున్నారు. వాటిల్లో సకల సదుపాయాలు సమకూర్చుకున్నారు. మాకింతవరకూ

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు, 9393981918

సొంతగూడు లేదు.

కనీసం వాళ్ళని చూసన్నా నేర్చుకుంటాడను కున్నాను. అబ్బే! మార్పేం లేదు. ఒకట్రెండు సార్లు వాళ్ళని ఉదాహరణగా చూపి 'వాళ్ళకన్నా ముందు పుట్టాను. పెళ్ళి చేసుకున్నాను. కానీ ఏం లాభం? ఆస్తులూ, అంతస్తులూ పెంచుకున్నది లేదు. మహారాణీలా కాకపోయినా మామూలుగానయినా



సుఖపడిందీ లేదు" అన్నాను మనసులో ఉక్రోషం ఉరకలు వేస్తుండగా, మాటల్లో అక్కసుని వెళ్ళగక్కుతూ!

"చూడు నీలూ. పోలిక అనేది మనిషి జీవితంలో అశాంతిని నింపుతుంది. సుఖం అన్నది డబ్బులోనూ, సదుపాయాల్లోనూ వుండదు. మన మనసులో, ఆలోచనలో ఉంటుంది. మనిషి ప్రశాంతంగా ఉండగలగాలి. డబ్బు రందిలో పడి నలిగిపోకూడదు. జీవితం నరకప్రాయం చేసుకోకూడదు" అని స్వామిజీలా ఉపదేశం చేసాడు.

"మనకు రత్న మాణిక్యా ల్లాంటి పిల్లలున్నారు. కనీసం వాళ్ళ భవిష్యత్తు గురించన్నా ఆలోచించాలి కదా?" వైవాహిక జీవితంలో కొన్ని సంవత్సరాలు దొర్లి పోవడంవల్ల వచ్చిన తెగింపుతో, మాటల్లో కాస్త కాఠిన్యపు పాళ్ళు పెంచాను.

"నువ్వే అన్నావుగా రత్నమాణిక్యాలని. వాళ్ళలో చదువుతో నగిషీలు దిద్దుతున్నాం. వాళ్ళే సంస్కారంతో స్వయం ప్రకాశితులవుతారు. ఆస్తులిచ్చి వాళ్ళని సోమరులుగా తయారు చెయ్యకూడదు నీలూ" మార్దవంగా అన్నాడు.

జీవితబాటలో ఆయనతో మరికొన్ని సంవత్స రాలు ప్రయాణించి, వృద్ధాప్యపు దశలోకి అడుగుపెట్టి ఇహ ఆయనలో నేననుకునే మార్పు చోటు చేసుకోదనుకున్నాక, ఆయన్ని వ్యతిరేకించడం, సాధించడం మాని ఆయన వ్యక్తి త్వాన్ని అర్ధం చేసుకోవడం మొదలెట్టాను.

దేవుడనేవాడు అన్నిచోట్లా తానుండలేక తనకు మారుగా ఇలాంటి కొంతమందిని సృష్టిస్తాడని పించింది. ఎవరికైనా ఏదైనా సమస్య వస్తే 'తాను ఓటేసి గెలిపించాడు కదా' అని ప్రభుత్వం తలుపు తట్టలేడు. ఇహ, పర లోకాల గురించి సమగ్రంగా వివరించి మనసుని మైమరపించే బాబాలు, స్వాముల గడప తొక్కలేడు. వాళ్ళని ఆదుకునేది పక్కింట్లోని ఈయన లాంటి సామాన్యుడే! అవసరానికి మాట సహాయం, డబ్బు సహాయం చేసి ధైర్యాన్నిచ్చేది అతడే! ఎవరికి వారు స్వార్థంతో తమచుట్టూ ఒక పరిధి గీసుకుని అందులోనే బందీ అయిపోతే సమాజం అనే పదానికి అర్ధమేమిటి? సంఘజీవి అన్నదానికి అస్తిత్వమేది?

నా భర్త దేవుడు. దేవుడంటే బాధల్లో, భయాల్లో, ఆపదల్లో తోడుండేవాడు. అంతేకానీ ఫోటోల్లో, కేలండర్లలో అచ్చేయించబడి గోడలకు వేళాడబడేవాడు కాదు. గర్భగుడిలో బందీ అయి పూజలు చేయించుకుంటూ భారీ కానుకలు హుండీలో వేయించుకునేవాడు అంతకన్నా కాదు.

మనిషి ఆస్తికత్వ, నాస్తికత్వ వాదాలతో కాలం వెళ్ళబుచ్చడం కాదు, సేవ చెయ్యడానికి అనుక్షణం తహతహలాడాలి. మానవ సేవలో తరించాలి. ముక్తినొందాలి. ఆయన సాహచర్యంలో ఇన్నేళ్ళున్నా, కొత్తకోణంలో ఆయన్ని చూస్తున్న నాకు, విషయం ఇప్పుడే బోధపడింది. మానసిక పరిణతినొందాక, పెళ్ళి పేరుతో ఆయన జీవితంతో మమేకమైన నా జీవితం పరిపూర్ణత్వాన్ని పొందిందనిపించింది. ఒక స్త్రీగా నాకు అంతకన్నా ఏమి కావాలి?

"నీలూ, ఇప్పుడే మీ పిన్నీవాళ్ళ దగ్గర్నుండీ ఎస్ ఎమ్ ఎస్ వచ్చింది. ఆవిడకు క్యాన్సర్ అట. ఇక్కడ బసవతారకం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్లో చూపించుకోడానికి మధ్యాహ్నం బండికి వస్తున్నారట. నేను స్టేషన్‌కు వెళ్ళి తీసుకొస్తాను. నువ్వు వంట ఏర్పాట్లు చూడు. వాళ్ళు ఇక్కడున్నంతకాలం ఎటువంటి ఇబ్బందీ కలగకూడదు" అన్నాడు.

"అలాగేనండీ" అన్నాను మనస్ఫూర్తిగా. ★

## భారతీయుడను నేను

జయగీతం పాడుతాను
జయహే అని సాగుతాను
నా దేశం గొప్పదనీ
జగమంతా చాటుతాను
కష్టాలకు బెదరిపోను
నష్టాలకు క్రుంగిపోను
కన్నీళ్ళను పెట్టుకుంటు
చతికిలపడి కలిగిపోను
బంతిలాగ పైకి లేచి
కాంతివైపు నడుస్తాను
మనుజుల కన్నీరు తుడిచి
మానవతను చూపుతాను
సాటి జనావళి పాడే
పాటలనే రచిస్తాను
మాటలతో పనేలేని
బాటలోన నడుస్తాను
'నేను' అనే భావనతో
గోడలు నిర్మించుకోను
'మేము' అనే యోచనతో
సంఘంలో బ్రతుకుతాను
విశ్వానికి నా సంస్కృతి
విశిష్టత చాటుతాను
విశ్వమంత నేనే అయి
విస్తరించి ఎదుగుతాను
వాల్మీకి వారసుడను
భారతీయుడను నేను
వేమన్నకు సోదరుడను
విశ్వమానవుడను నేను
జయగీతం పాడుతాను
జయహే అని సాగుతాను
భారతీయుడను నేను
భారతీయుడను నేను – డా॥ తిరునగరి